

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కరిస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తదితరులు.







# గురువులతోనే సమాజాభివృద్ధి

**ఉపాధ్యాయ దినోత్సవంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ విద్యాధరిలు**

చిత్తూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

పాఠశాల, కళాశాల స్థాయిల్లో గురువులు నేర్పిన విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నారని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ విద్యాధరిలు అన్నారు. జడ్పీ సమావేశభవనంలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయి గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు నగర మేయర్ అముద, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవం పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం అందరికీ ఆనందంగా వుందన్నారు. గురువులు లేని సమాజం అర్థం లేనిదన్నారు. ఒక వ్యక్తి ఐపిఎస్, ఐఎఎస్, రాజకీయ నాయకులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తోడ్పడే మహనీయులు ఉపాధ్యాయులే అన్నారు. ఉపాధ్యాయులు వారి వృత్తి ద్వారా విద్యార్థులకు జ్ఞానంను పంచి దేశంతో పాటు రాష్ట్ర, గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి దిశా నిర్దేశం చేస్తున్నారన్నారు. దేశాభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ ప్రతి మనిషి తన తల్లి, తండ్రి తరువాత అంతటి ప్రత్యేక స్థానం గురువుకు ఇస్తారన్నారు. ఇంతటి ఉన్నత వృత్తిలో వున్న ఉపాధ్యాయులను గౌరవించుకునే అవకాశం రావడం అదృష్టమన్నారు. ఒక ఉపాధ్యాయునిగా ఇప్పటి వరకు చాలా మంది జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దివుంటారని, తమ సేవలను ఇలాగే కొనసాగించి మరింత మంది జీవితాల్లో వెలుగులు నింపాలని ఆమె ఉపాధ్యాయులను కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ గురువులు తమ విద్యార్థులను చెడు అలవాట్లకు దూరం చేసి విద్యతో పాటు సత్ప్రవర్తనను నేర్పాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ప్రేరణ కల్పించాలన్నారు. నేటి విద్యార్థులు భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఎదిగి దేశ, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడేలా మంచి నడవడికలు అలవాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుడిగా సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలకు గుర్తుగా ఆయన జన్మదినంను గురుపూజోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి భవిష్యత్తులో వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవలతో ఉపాధ్యాయ వృత్తి అంటే గౌరవం, భక్తి లభించిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులను జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్, మేయర్ అముదలు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు, సమగ్ర శిక్ష అభియాన్ ఎపిసి వెంకటరమణారెడ్డి, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి, చిత్తూరు డివైఇఓ చంద్రశేఖర్, విద్యాశాఖ అధికారులు, అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




గురుపూజోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు.







# విద్యార్థులు వృద్ధికి గురువులు నిరంతరం కృషి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త

విద్యార్థులు వృద్ధికి గురువులు నిరంతరం కృషి చేస్తారని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం కచ్చపి ఆడిటోరియంలో జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమం ఏర్పాటుతో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించగా కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ పలువురు ప్రజా ప్రతినిధులు, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 150 కోట్లు పైబడి భారత జనాభా ఉంటే అందులో సుమారు 60 కోట్ల మంది 25 సంవత్సరంలోపు ఉంటారని, వారిని సమాజానికి ఎంతగానో ఉపయోగపడే విధంగా, మంచి బాటలో నడిచేలా గురువులు తీర్చిదిద్దితే, మన దేశ భవిష్యత్తు ఎండో గొప్పగా ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సభాధ్యక్షులు మాట్లాడుతూ తల్లి తండ్రి గురువులలో గురువులకు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే ఎంతో గురుతర బాధ్యత ఉందని తెలిపారు. ఎంపి మద్దిల గరుమూర్తి మాట్లాడుతూ భారత దేశ సమ సమాజ నిర్మాణంలో గురువు బాధ్యత ఎంతో గొప్పది అని, ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంఎల్సి సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ గురుబ్రహ్మలందరికీ పాదాభివందనాలు అని తెలుపుతూ గురువులు నిచ్చెనల వంటి వారని, వారు అన్నీ భరిస్తూ తమ విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆహుతులను విద్యాశాఖ తరపున సన్మానం చేశారు. కార్యక్రమానికి ముందుగా పలు విద్యాలయాల నుండి విద్యార్థిని విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి డా.వి. శేఖర్, ఉప విద్యాధికారులు బాలాజీ, ప్రభాకర్ రాజు, శాంతి, మండల విద్యాధికారులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

**-ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్**



కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ పట్టెం గురు ప్రసాద్ తెలిపారు. గురువారం ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలయంలో ఈనెల 7 నుండి సెప్టెంబర్ 27 వరకు 21 రోజులు పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వినాయకచవితి సందర్భంగా సుమారు 80 వేల నుండి లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశమున్నందున ఆమేరకు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అలాగే వినాయకచవితి రోజున వేకువజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం ఉదయం 3 గంటల నుండి స్వామివారి దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు. వసతి, అన్నదానం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఆలయంలో ఉచిత దర్శనంతో పాటు 100, 150 రూపాయలు, విఐపీలు, చంటి బిడ్డల తల్లులకు, వికలాంగులకు వేర్వేరుగా ప్రత్యేక కూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే భక్తులకు కావలసిన లడ్డూ ప్రసాదాలను అందించేందుకు లక్ష చిన్న లడ్డూలను, చిన్నలడ్డూలు, ఐదు వేల వడలు, ఐదు వేల పులిహోర ప్యాకెట్‌లను అందుబాటులో వుంచుతున్నట్లు వారు తెలిపారు.

### ఏర్పాట్లును పరిశీలించిన జిల్లా ఎస్పీ



కాణిపాకం బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లును ఆలయ, పోలీసు అధికారులతో కలసి జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలో ఏర్పాటు చేస్తున్న కూలైన్లు, లడ్డూ ప్రసాద వితరణ కేంద్రాలు, స్వామివారు ఊరేగే రథం, రథోత్సవం నిర్వహించే మాఢావీధు లు, వాహన పార్కింగ్, ఆలయ పరిసరాలను వారు పరిశీలించారు. ఈకార్యక్రమంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, రూరల్ సీఐ శ్రీదర్‌నాయుడు, స్థానిక ఎస్సై ధరణీదరలతో పాటు ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**భారీ బందోబస్త్ మధ్య...**

## మఠం భూములలో అక్రమణలు తొలగింపు

**తొలగింపులో పాల్గొన్న ఆర్డీఓ, ఎస్పీలు, డియస్పీలు సి.ఐ.లు, పోలీసు**



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

శ్రీహథీరాంజీ బాబా మఠం భూములలో వెలసిన అక్రమ నిర్మాణాలను పునాదులతో సహా పెకలించివేసారు. మఠం, రెవెన్యూ, పోలీసుల సమన్వయంతో బుధవారం ఆర్థరాత్రి నుండి అక్రమ నిర్మాణాలపై కొరఢా ఝుళిపించారు. మఠం భూములలో ఆక్రమణల తొలగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసు ఉన్నతాధికారులతో పాటు వందల కొద్ది పోలీసులను పహార పెట్టి, ఆక్రమణలను తొలగింపును కొనసాగించారు. పది జెసిబిల సాయంతో వందల సంఖ్యలో నిర్మితమైన అక్రమణాలను కూల్చివేసారు. తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 364లో 18.90 ఎకరాలు, 368/1లో 7.70 ఎకరాల భూమిలో బి.శివా నాయక్ అతని అనుచరులు శ్రీ స్వామి హథీరాంజీ బావాజీ మఠం పరిరక్షణ సమితి' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసుకుని మఠం భూములలో అక్రమంగా ప్రవేశించారని మఠం పరిపాలన అధికారి కె.ఎస్.రామారావు పేర్కొన్నారు. వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మఠం భూమిలో హథీరాంజీ బావాజీ గుడి నిర్మాణానికి 5ఎకరాల స్థలం కేటాయించాలని దేవాదాయ కమీషనర్‌కు 2022 ఫిబ్రవరి 14న అర్జీ పెట్టుకున్నారని తెలిపారు. దేవాదాయ కమీషనర్ అర్జీ విషయమై నివేదిక పంపమని అప్పటి మహంత్ అర్జున్‌దాస్ కొరగా హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి మఠం భూమిని ఇతరులకు ఏవిధంగా కూడా కేటాయించుటకు వీలుపడదని 2022 మార్చి 3న కమీషనర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. గతంలో మఠం భూములలో ఆక్రమణలు నిలుపుదలకు వెళ్ళిన మఠం అధికారులపై అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. అప్పట్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఎలక్షన్ విధులలో నిమగ్నమై ఉండట చేత మఠం సిబ్బంది వెనక్కి వచ్చినట్లు తెలిపారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సహాయంతో మఠం భూముల లోని ఆక్రమణలు తొలగించారు. తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, తిరుపతిరూరల్ తహశీల్దార్ రామాంజుల నాయక్, ఎఎస్పీలు రవి మనోహరాచారి, నాగభూషణం, డియస్పీలు, సి.ఐ.లు, రెవెన్యూ సిబ్బంది శివకుమార్, సర్వేయర్ కరుణకుమార్, విఆర్వో శ్రీధర్, పోలీసులు పాల్గొన్నారు.




## విఘ్నేశ్వరుని పండగకు సిద్ధమౌతున్న దక్షిణ కైలాసం



**శ్రీకాళహస్తిలో 500 చోట్ల విగ్రహాల ప్రతిష్టకు సన్నాహాలు**

వినాయక విగ్రహాలను ముస్తాబు చేస్తున్న కళాకారులు



## అంతరిక్ష కేంద్రంలో ఘనంగా టీచర్స్‌డే వేడుకలు

శ్రీహరికోట (తడ), సెప్టెంబర్ 5 ప్రభాతవార్త




శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్రహ్మ ప్రకాష్ హాలులో జరిగిన ఈ కార్యక్ర మానికి షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి శాస్త్రవేత్తలు పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి తమిళనాడు సైన్స్ అండ్ టెక్నాలజి సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఐకె లెనిన్ తమిళ్ కోవన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో స్పేస్ సెంట్రల్ స్కూలు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ ఉపాధ్యాయ, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం స్పేస్ సెంట్రల్ స్కూలు, జడ్పీ హైస్కూలు టీచర్లు, విద్యార్థులు, షార్ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

# విద్యతోనే ఉన్నత స్థితికి విద్యార్థులు

## విజయం కళాశాలలో గురుపూజోత్సవ వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:
విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. విజయం విద్యాసంస్థల్లో గురుపూజోత్సవం పురస్కరించుకుని గురువారం విజయం కళా శాల, అధ్యాపకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి, తమ తల్లి దండ్రుల ఆశలు నెరవేర్చడానికి ముఖ్య ఆయుధం చదువు ఒక్కటే అన్నారు. సామాజిక మాధ్యమాలు, చరవాణిలతో విద్యార్థులు విలువైన సమయంను వృథా చేసుకోకుండా రోజు ఇంగ్లీషు, తెలుగు దిన పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు.




### సమాజ హితం కోసం విద్యార్థుల రక్తదానం :ఎమ్మెల్యే మురళీమోహన్

సమాజ హితం, సేవాతత్పరతతో విజయం విద్యాసంస్థల విద్యార్థులు, అధ్యాపకులు గురుపూజోత్సవం పురస్కరించుకుని రక్తదానం చేయడం అభినందనీయమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం విజయం విద్యాసంస్థల ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ సమాజ హితం కోసం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంకు వందలాది విజయం విద్యాసంస్థల విద్యార్థులు హాజరై రక్తదానం చేయడం ఆనందంగా వుందన్నారు. సమాజంలో ఆపదలో వున్న వారికి రక్తం ఇచ్చి ఆదుకోవాలన్న సేవాభావంను విద్యార్థులకు నేర్పి రక్తదాన కార్యక్రమంలో పాల్గొనేలా ప్రేరణ కల్పించిన విజయం విద్యాసంస్థల యాజమాన్యంను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా జాతీయ కోడిగ్రుడ్ల సమన్వయ సంఘం(నెక్) సంస్థ సోషల్ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఉచితంగా అందించిన ట్రోపుడు బండ్లను లబ్దిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. నెక్ రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్యాక్రమం చేపట్టిందని పూతలపట్టు నియోజకవర్గంకు 150 తోపుడు బండ్లు నెక్ సంస్థ అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ రమేష్, విజయం విద్యా సంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఆర్థికసాయం చేయడం సంతోష దాయకం

### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త
గూడూరు పట్టణంలోని పిఆర్ క్లబ్ యాజమాన్యం గురువారం లక్ష రూపాయిలు ఆర్థిక సహాయాన్ని పిఆర్ క్లబ్‌లో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కి అందించారు. గూడూరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా పిఆర్ క్లబ్‌కి రావడంతో క్లబ్ సభ్యులు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు.



అదే విధంగా గూడూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి వరద బాధితులకు 20 వేల రూపాయిలు నగదును, కాస్మోపాలిటన్ క్లబ్ వారు 50000 రూపాయిలు చెక్కును ముఖ్యమంత్రికి అందించామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కి అందించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ క్లబ్ ప్రెసిడెంట్ కోడూరు మేరా రెడ్డి, కార్యదర్శి మధు రెడ్డి, కె. రామ్మోహన్ రావు, తలమంచి సిద్ధారెడ్డి, చదలవాడ హరిబాబు, పులిమి శ్రీనివాసులు, నేలబల్లి భాస్కర్ రెడ్డి, కొండూరు వెంకటేశ్వరరాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, భయ్యా మోహన్ రావు, బిల్లు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ ఫ్లడ్ విక్టమ్స్ విజయవాడ అనే ట్యాగ్ లైన్‌తో సైకత శిల్పం




చిల్లకూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త
విజయవాడలో అనుకోని విధంగా జరిగిన వరద వల్ల అనేక మంది ప్రజలు కష్టాలు పడుతున్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని మనమందరం వీలైనంత సహాయం సహకారాలు అందించాలనే ముఖ్య ఉద్దేశ్యంలో ఏరూరు సాగరతీరంలో హెల్ప్ ఫ్లడ్ విక్టమ్స్ విజయవాడ అనే ట్యాగ్ లైన్‌తో చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన మంచాల సనత్ కుమార్ సైకత శిల్పం చేసారు. ఎవరైనా చనిపోయిన కూడా కనీసం ఖననం చేయలేనటువంటి స్థితిలో విజయవాడ ప్రజలు ఉన్నారు. చంటి బిడ్డలు, ముసలివారు ప్రజలందరూ కూడా ఆహారం త్రాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. వారికి చేయి అందించేటువంటి బాధ్యత మనందరి పైన ఉందన్నారు. అధికారులు, అనధికారులు ప్రజలు అందరూ కూడా చేయిందించాలనేటువంటి ఉద్దేశ్యంతో చేయిని సైకత రూపంలో చేయడం జరిగిందన్నారు.

## తుఫాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త
తుఫాను బాధితులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. విజయవాడలోని సింగ్ నగర్‌లో తుఫాన్ వల్ల నిరాశ్రయులైన వారికి ఎమ్మెల్యే రామకృష్ణ, పార్టీ నాయకులు రెండోరోజు ఆహారాన్ని సరఫరా చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు తుఫాను బాధితులకు ఇబ్బంది లేకుండా తగు సహాయ చర్యలు నాయ కులు అధికార యంత్రం ద్వారా అందించినట్లు తెలిపారు.




మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి తుఫాను బాధి తులను రాజకీయాలు చేస్తున్నట్లు విమర్శించారు. బాధితులకు సహాయం చేయకపోగా విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వర రావు, నాయకులు సత్యనారాయణ, రాయి సత్యం నాయుడు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతిచే అవార్డు అందుకున్న సురేష్



.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కూనాటి సురేష్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ముచే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. 22 సంవత్సరాలుగా సాంఘిక శాస్త్రంలో పాఠ్యపుస్తకాలను రచించడం, ఉపాధ్యాయ శిక్షణ కరదీపికలను రచించడం పాఠ్యాంశ బోధనలో డిజిటల్ విధానాన్ని జోడించడం అంధ విద్యార్థులకు ఆడియో రూపంలో తయారు చేసి అందించడం, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఐదు లక్షల మంది పిల్లలకు, ఇంటరాక్టివ్ వీడియోలును తయారు చేసి అందించారు. కాగా నేడు ప్రధానమంత్రి నరేంద్రమోడీతో కూడా కానున్నట్లు తెలిపారు. జాతీయ అవార్డు అందుకున్న కూనాటి సురేష్‌కు పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ఐ రహీంరెడ్డికి ఛార్జ్‌మెమో

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త
సూళ్లూరుపేట ఎస్ఐగా పనిచేసి ఇటీవలే వీఆర్‌కు వెళ్లిన కోట రహీంరెడ్డికి ఛార్జ్‌మెమో జారీ చేస్తూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. 2023లో జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి అప్పుడు పనిచేసిన ఎస్ఐ రవిబాబు చేసిన తప్పిదాలను సరిచేయకుండా తిరిగి వాటినే కోర్టుకు సమర్పించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ రహీంరెడ్డికి ఛార్జ్‌మెమో జారీ చేశారు. ఇదే విషయమై ఎస్ఐ రవిబాబును సస్పెండ్ చేసి ఉన్నారు. పోలీసు శాఖలో ఇటువంటి చర్యలు చేసిన వారిపై శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.

## ఘనంగా మేయర్ డాక్టర్ శిరీష జన్మదిన వేడుకలు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త
తిరుపతి నగర పాలక సంస్థ తొలి మేయర్ డాక్టర్ శిరీష జన్మదిన వేడుకలు గురువారం తన ఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. నగర పాలక సంస్థ అధనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య వివిధ శాఖల ఉద్యోగులు మేయర్‌ని కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేయర్ వద్ద కేక్ కటింగ్ నిర్వహించారు. దొడ్డరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



అనంతరం రైల్వే స్టేషన్ వద్ద ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు. వైష్ణవి హాస్పిటల్ వద్ద డాక్టర్స్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వృషభరాశి వినాయకుడు: హనుమంత వాహనంపై ప్రతిష్ట

### విశ్రాంత ఉపాధ్యాయుని సృష్టి

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన పోలస్వామి.స్వర్ణమూర్తి రిటైర్డ్ అయిన తరువాత కూడా ధార్మిక కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం నిర్వహిస్తున్నారు. వృషభ రాశి గణపతిగా రూపొందించారు. దీన్ని ముత్యాలమ్మగుడివీధిలోని చక్రేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా వున్న పోలస్వామి లేన్‌లో ప్రతిష్టించి మూడు రోజుల పాటు ఉంచి నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. గతంలో నారికేళగణపతి, ఈగ గణపతి, వృక్షగణపతి, మత్స్య గణపతి, సింహరాశి గణపతి రూపొందించి ప్రతిష్టించారు. ప్రస్తుతం "వృషభరాశి" గణపతిని రూపొందిం చారు. 12రాశులకు సంబందించి 13 సంవత్సరాలుగా ప్రత్యేకతను రూపొంది స్తున్నారు. ప్రతి ఏడాది గురువు మారుతుందని ఈరాశులకు సంబందించి వివిధ రూపాలు ప్రతిష్టించనున్నట్లు చిత్రకారుడు పోలస్వామి. స్వర్ణమూర్తి తెలిపారు.




శ్రీకాళహస్తి లోని పోలస్వామిలేన్‌లో ప్రతిష్టించే గణపతి చిత్రం ఇదే, స్వర్ణమూర్తి(చిత్రకారుడు)

## వరదబాధితులకు పాలప్యాకెట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



చిత్తూరురూరల్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనల మేరకు విజయవాడలోని 16వ వార్డు కృష్ణలంక, పరిసర వరద ప్రభావిత ప్రాంతాల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రెండవ రోజు పర్యటిస్తూ బాధితులకు పాలప్యాకెట్లను పంపిణీ చేసారు. అవసరమైన వారికి నిత్యావసర వస్తువులను అందజేస్తూ, వరద బాధితులను ప్రభుత్వం అన్ని విదాలా ఆదుకొంటుందని వారికి భరోసా కల్పించారు. అలాగే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వైద్యశిబిరాల వద్దకు వెళ్లి బాధితులకు అందుతున్న వైద్యసేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్న కేశవులు

కుప్పంరూరల్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆవుల కేశవులు గురువారం జిడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్, డిఇఒ జయరాజ్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో తనకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం రావడం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. విధి నిర్వహణలో మరింత అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా మార్చేందుకు తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేశవులును ఉపాధ్యాయసంఘాల నేతలు, ఉపాధ్యాయులు అభినందించారు.



## ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఇద్దరు




పాలసముద్రం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:
జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలానికి చెందిన ఇ.కోదండయ్య, జి.జమునరాణిలు గురువారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో గురువారం జిల్లా స్థాయి గురుపూజోత్సవం కార్యక్రమంలో ఈ అవార్డును మండలంలోని వనదుర్గాపురం ఎంపియుపి పాఠశాల హెడ్మాస్టర్ ఇ.కోదండయ్య, టివిఎన్ఆర్ పురం ఎంపిపి పాఠశాల హెడ్మాస్టర్ జి.జమునారాణిలు అవార్డులు అందుకున్నారు. ఎంఇఒ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించడంతో ఇ.కోదండయ్య, జి.జమునరాణిలకు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయ్యారని పేర్కొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు



చిల్లకూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త
మండల పరిధిలోని పారిచర్ల వారి పాలెం గ్రామంలో ఏర్పాటైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం వేడుకలను గనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చిల్లకూరు మండల అధ్యక్షురాలు తుపాకుల వెంకటరమణ పాల్గొన్నారు. విద్యార్థులచే క్రీడ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులచే చేయించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో ఘనంగాసన్మానించారు. అదే విధంగా చిల్లకూరు ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో డి. సనత్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బాల చెన్నయ్య ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని వారి ఖ్యాతిని స్మరించుకుంటూ గురువుల ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుధాకర్ ప్రజేందర్ రెడ్డి, మాధవయ్య, శేఖర్ కుమారు, మంజుశ్రీ, చంద్రయ్య, సురేంద్ర, కొంత మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

### - ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య దొరస్వామి



కుప్పం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త
ప్రపంచంలోనే ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య దొరస్వామి పేర్కొన్నారు. గురువారం ద్రవిడ వర్సిటీ, కుప్పం ఒకేషనల్ కాలేజ్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను ఈసందర్భంగా వివరించారు. అనంతరం ఉపకులపతిని ఘనంగా అధ్యాపకులు సత్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, ఒకేషనల్ అధ్యాపకులు జగదీష్ బాబు, షహీన్‌తాజ్, సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డినాయక్, ఏడుకొండలు, రిజ్వాన్, కార్తీక్ పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



శాంతిపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త
స్థానిక శ్రీ పరమహంస యోగానంద పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. వివిధ పోటీల్లో గెలిచిన ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. విద్యాలయ ఛైర్మన్ గోపాల్ అగర్వాల్, జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు రుణపడి ఉండాలన్నారు. పిల్లల జీవితాలనుమలచేది ఉపాధ్యాయులేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆర్డీఓ శ్రీనివాసులురాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి సమాజంలో గౌరవప్రదమైందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.

## నిబంధనలు పాటించండి

### -ప్రమాదాలను నివారించండి
### -వాహనదారులకు డిఎస్పీ విజయశేఖర్ హితవు




తిరుమల, సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:
పుణ్యక్షేత్రం తిరుమలకు పలు రకాలుగా వాహనాల్లో చేరుకుంటున్న యాత్రికులు, స్థానికులు నిబంధనలు పాటించాలని తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ కోరారు. ముఖ్యంగా తిరుపతి,తిరుమల స్థానికులు రోజువారీగా ద్విచక్రవాహనాలపై తిరుమలకు, తిరుపతికి వెళుతుంటారు. ఇలా వెళ్ళేవాళ్ళు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి ఇవన్నీ కలిగి ఉండాలన్నారు. అంతేగాక మద్యం సేవించి వాహనాలను నడపవద్దని హితవు చేశారు. తిరుమల ఘాట్‌లో ప్రమాదాలను నియంత్రించడానికి తిరుమల,తిరుపతి టోల్‌గేట్‌ల వద్ద డిఎస్పీ విజయశేఖర్, ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ వాహనాలను తనిఖీ చేయడం, వాహనదారులకు నిబంధనలు గురించి తెలియజేయడం చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని చెబుతున్నారు.










